సాక్షి
సంగారెడ్డి
బుధవారం, 24, మే, 2023



వేడుకలకు వెళ్లివస్తూ అనంతలోకాలకు..

ట్రాక్టర్‌ను వెనుక నుంచి కారు ఢీ కొనడంతో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 8లో



చైర్‌పర్సన్ తీరుపై మండిపాటు

సంగారెడ్డి మున్సిపల్ బల్దియాలో అవినీతి పేరుకుపోయిందని, చైర్‌పర్సన్ గద్దె దిగాలంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు నిరసన తెలిపారు. 9లో

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 14 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. ఆర్టీపీసీఆర్ టెస్టులు 15 మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

డివిజన్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించండి

- జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌తో ఎమ్మెల్యే



కమిషనర్ కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పటాన్‌చెరుటౌన్: జీహెచ్ఎంసీ పరిధిలోని భారతినగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్‌ల పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్‌కు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం వినతిపత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బల్దియ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్ప నగేశ్, సింధు ఆదర్శ్ రెడ్డితో కలిసి సమావేశమయ్యారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మూడు డివిజన్ల పరిధిలోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తుందని ఎమ్మెల్యే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు అనుగుణంగా సత్వరమే నిధులు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలో నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

వీవోఏల సమస్యలు పరిష్కారంలో సర్కార్ విఫలం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: వీఓఏల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలో 36 రోజులుగా వీఓఏలు చేస్తున్న సమ్మె శిబిరానికి వెళ్లి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏ డిమాండ్స్ న్యాయమైనవన్నారు. వీవోఏ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు కలెక్టరేట్‌ల ధర్నా కార్యక్రమంలో వీవోఏలపై పోలీసులతో లాఠీచార్జి చేయడం దుర్మార్గమన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, వీఓఏలు పాల్గొన్నారు.

ఆర్డీఓలకు స్థానచలనం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లాలో పలువురు ఆర్డీఓలకు స్థాన చలనం కలిగింది. రాష్ట్ర వ్యాప్తంగా పది మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. సంగారెడ్డి ఆర్డీఓ మెంచు నగేష్‌ను జిల్లా రెవెన్యూ అధికారిగా నియమించింది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్.రవీందర్‌రెడ్డిని సంగారెడ్డి ఆర్డీఓగా నియమితులయ్యారు. నారాయణఖేడ్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్‌ను బదిలీ చేసి మెదక్ ఆర్డీఓగా నియమించింది. పెద్దపల్లి జిల్లా సింగరేణి కాలరీస్ ఎస్‌డీసీ (భూసేకరణ)గా పనిచేస్తున్న కె.నర్సింహమూర్తిని నారాయణఖేడ్ ఆర్డీఓగా నియమితులయ్యారు. జహీరాబాద్ ఆర్డీఓగా పనిచేస్తున్న ఎస్.రమేష్‌బాబును సిద్దిపేట్ ఆర్డీఓగా నియమించింది. హుజూర్‌నగర్ ఆర్డీఓగా పనిచేస్తున్న కె.వెంకట్‌రెడ్డిని జహీరాబాద్ ఆర్డీఓగా నియమితులయ్యారు. దేవరకొండ ఆర్డీఓగా పనిచేస్తున్న కె.గోపీరాంను అందోల్ ఆర్డీఓగా నియమించారు. ఆందోల్ ఆర్డీఓ పోస్టు గత కొన్ని రోజులుగా ఖాళీగా ఉంది. నల్గొండ ఆర్డీఓగా పనిచేస్తున్న ఎం.జయచంద్రరెడ్డిని మెదక్ జిల్లా తూప్రాన్ ఆర్డీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఆర్డీఓగా ఉన్న వి.శ్రీనివాసులను మెదక్ జిల్లా నర్సాపూర్ ఆర్డీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.



మెంచు నగేష్



అంబాదాస్ రాజేశ్వర్



రమేశ్ బాబు

పీఆర్.. పునర్‌వ్యవస్థీకరణ

ఉమ్మడి మెదక్ జిల్లాకు తొమ్మిది సబ్ డివిజన్ ఆఫీసులు

- సిద్దిపేట జిల్లాకు కొత్తగా ఎస్ఈ కార్యాలయం

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్‌శాఖ (పీఆర్) పునర్‌వ్యవస్థీకరణ జరిగింది. దీనివల్ల కొత్తగా ఉమ్మడి జిల్లాలో పరిధిలో తొమ్మిది సబ్ డివిజన్ ఆఫీసులు రాగా, సిద్దిపేట జిల్లాకు కొత్తగా ఎస్ఈ కార్యాలయం మంజూరైంది. దీంతో పీఆర్ పరిధిలో అభివృద్ధి పనులు మరింత వేగంగా నాణ్యతతో జరగనున్నాయి. ఈ మేరకు పీఆర్ అధికారులు మంగళవారం పునర్ వ్యవస్థీకరణ చేశారు. త్వరలో కార్యాలయాల పరిధిని ప్రకటించి వీటిని అందుబాటులోకి తేనున్నారు.



సిద్దిపేటలోని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ డివిజన్ కార్యాలయం

సిద్దిపేటకు ఎస్ఈ కార్యాలయం

- మెదక్ సర్కిల్ పరిధిలో మెదక్, సంగారెడ్డి, అందోల్, సిద్దిపేట డివిజన్ కార్యాలయాలు ఉన్నాయి.
- పునర్‌వ్యవస్థీకరణలో సిద్దిపేట జిల్లాకు సర్కిల్ కార్యాలయం, గజ్వేల్‌కు డివిజన్ కార్యాలయం కేటాయించారు.
- కొత్తగా కేటాయించిన వాటితో ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు సర్కిల్, ఐదు డివిజన్ కార్యాలయాలకు చేరాయి.
- సిద్దిపేట జిల్లాలో సబ్ డివిజన్ కార్యాలయాలు సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్, వర్గల్ ఉండగా కొత్తగా చిన్నకోడూరు, తొగుటకు మంజూరయ్యాయి.
- మెదక్ జిల్లాలో మెదక్, కౌడిపల్లి, నర్సాపూర్, తూప్రాన్, అల్లాదుర్గంలో ఇప్పటికే ఉండగా, కొత్తగా రామాయంపేటకు సబ్ డివిజన్ కార్యాలయం మంజూరైంది.
- సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, జహీరాబాద్, పటాన్‌చెరు, అందోల్, సిర్గాపూర్, నారాయణఖేడ్‌లు ఉండగా, కొత్తగా సదాశివపేట, ఝురాసంగం, పుల్‌కల్‌కు సబ్ డివిజన్ కార్యాలయాలు మంజూరయ్యాయి.
- అందోల్, సిద్దిపేట, గజ్వేల్‌కు క్వాలిటీ కంట్రోల్ సబ్ డివిజన్ కార్యాలయాలు మంజూరయ్యాయి.

జిల్లాల వారీగా రోడ్ల వివరాలు

జిల్లా	రోడ్లు	సీసీ కి.మీ	బీటీ	మెటల్	మట్టి రోడ్లు	మొత్తం
మెదక్	941	159.75	846.79	186.09	640.25	1832.89
సంగారెడ్డి	1078	125.21	1176.38	381.29	1071.24	2625.53
సిద్దిపేట	1019	167	1358	154	975	2654

త్వరలో పరిధి నిర్ధారణ

పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్ వ్యవస్థీకరణతో జిల్లాకు మేలు జరుగుతుంది. సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్‌ల ఏర్పాటుతో పనులు త్వరగా ప్రారంభించే అవకాశం ఉంటుంది. త్వరలో ఆయా కార్యాలయాల పరిధిని ప్రకటించి అందుబాటులోకి తెస్తాం.

– జోగారెడ్డి, ఎస్ఈ, మెదక్

ఇక్కడే అనుమతులు..

- గతంలో రూ.10లక్షల కంటే ఎక్కువ నిధులు అవసరమయ్యే పీఆర్ అభివృద్ధి పనుల మంజూరు కోసం మెదక్ ఎస్ఈ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది.
- ఇక్కడ నుంచి మెదక్‌కు ఫైల్ పంపిస్తే, నిధులు మంజూరై వచ్చేసరికి ఆలస్యం అయ్యేది.
- ఎస్ఈ కార్యాలయం మంజూరుతో ఇక్కడే రూ.50లక్షల వరకు టెక్నికల్ పనులకు అనుమతులు ఇచ్చే అవకాశం వచ్చింది.
- జిల్లాలో చేపట్టే ప్రతీ అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్లు, అగ్రిమెంట్‌లు ఇకనుంచి ఎస్ఈ పరిధిలోనే జరగనున్నాయి.
- పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ పునర్‌వ్యవస్థీకరణ చేసిన సీఎం కేసీఆర్, మంత్రులు హరీశ్‌రావు, దయాకర్ రావు, కేటీఆర్, సీఎస్ శాంతి కుమారికి ఆ శాఖ ఇంజినీర్లు కృతజ్ఞతలు తెలిపారు.

లింగాయత్‌లకు పార్లమెంట్‌లో 10 శాతం సీట్లు కేటాయించాలి

జోగిపేట(అందోల్): వీరశైవ లింగాయత్‌లు జూన్ 4వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర వీరశైవ లింగాయత్ సంఘ అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ అన్నారు. మంగళవారం జోగిపటలోని బసవేశ్వర విగ్రహం వద్ద చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జోగిపేటలోని శ్రీ ఈశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాలు లింగాయత్ సమాజాలకు నిధులు కేటాయించడం లేదన్నారు. ఈర్యాలీ ద్వారా సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. లింగాయత్‌లను ఓబీసీలో కలపాలని కేంద్ర ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు. రాబోయే శాసనసభ, పార్లమెంటు ఎన్నికలలో అన్ని రాష్ట్రాలలో పది శాతం, పార్లమెంట్ ఎన్నికల్లో మూడు శాతం సీట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమానికి అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షుడు యస్.సత్యవ్రత్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివకుమార్, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, రాష్ట్ర యువదళ్ అధ్యక్షుడు ఐ.మధు, జిల్లా వీరసేవా సంఘం సమాజ నాయకుడు వెన్న చంద్రప్ప, వీరశైవ లింగ సమాజ కార్యదర్శి జె.శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సబ్ సెంటర్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

జూమ్ మీటింగ్‌లో మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డిటౌన్: సబ్ సెంటర్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని మంగళవారం మంత్రి హరీశ్‌రావు కలెక్టర్లు, వైద్యారోగ్య శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో జూమ్ మీటింగ్‌లో ఆదేశించారు. జిల్లాకు 2630 న్యూట్రిషన్ కిట్స్ వచ్చాయని కలెక్టర్ డాక్టర్ శరత్ మంత్రికి తెలిపారు. వాటి పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాకు 19 బస్తీ దవాఖానాలు మంజూరు కాగా 18 అందుబాటులోకి తీసుకువచ్చామని, ఒకటి ప్రారంభానికి సిద్ధంగా ఉందని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 173 పల్లె దవాఖానాలు ఉన్నాయని, అందులో 136 దవఖానాలలో ఎంఎల్‌హెచ్ పి (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్)ల నియామకాలు పూర్తయ్యాయని, 37 పల్లె దుకాణాలకు ఎంఎల్ హెచ్‌పిల నియామకాలు బుధవారం చేపట్టనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

జిల్లాలో ఐదు పీహెచ్‌సీలకు కొత్త భవనాలు మంజూరయ్యాయని నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కంటి వెలుగులో మే 22 నాటికి 11,27,952 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. జూన్ 15లోగా వంద శాతం పూర్తి చేస్తామన్నారు. జూమ్ మీటింగ్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రి దేవి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్ కుమార్, ఆర్ఎంఓ సంగారెడ్డి, డాక్టర్ శశాంక్, పంచాయతీరాజ్ ఈఈ జగదీశ్వర్ పాల్గొన్నారు.

జేపీఎస్‌ల హర్షం

సంగారెడ్డి టౌన్: రెగ్యులరైజేషన్‌పై జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల జిల్లా అధ్యక్షుడు నీరడి రాజు ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌కు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని దేశ స్థాయిలో రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకొస్తామని ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

'కంటి వెలుగు' శిబిరం పరిశీలన

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం జిల్లా క్వాలిటీ కంట్రోలర్ హేమావతి సందర్శించారు. శిబిరంలో రోగులకు చేస్తున్న పరీక్షలు, అద్దాల పంపిణీ తదితర వివరాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా కంటి పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): వ్యవసాయ రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో రైతులకు సబ్సిడీపై జీలుగు, జనుము విత్తనాలను అందజేశారు. భూ సాంద్రత పెంచేందుకు జీలుగు, జనుము విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ప్రేమ్ రాజ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ కలెక్టరేట్ ఏఓ మహిపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల కావస్తున్న ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. తడిచిన వడ్లను ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గోనె సంచులు ఉచితంగా ఇవ్వాలని, ప్రభుత్వం ప్రతీ గింజ కొంటామన్న వ్యాఖ్యలు ప్రకటనలకు మాత్రమే పరిమితమైందన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యాదవ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిజ్ఞాస పోటీల్లో 'తారా' విద్యార్థులకు ద్వితీయ బహుమతి

కొండాపూర్(సంగారెడ్డి): రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలవడం గర్వకారణమని ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో డాక్టర్ అభిజిత్ రసాయన శాస్త్ర అధ్యాపకుల శాస్త్ర విభాగంలో నిర్మాణ రంగ వ్యర్థాలతో పర్యావరణహిత ఇటుకల తయారీ అంశంపై పరిశోధన చేసినందుకు ద్వితీయ బహుమతి లభించిందన్నారు. ఈ పరిశోధనలో బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులు భవానీ, బర్సా, ఈశ్వరీ, బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు శివకుమార్, రాహుల్ పాల్గొన్నట్లు తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కారు దిగి.. రైతుకు సాయం..



ధాన్యంపై పట్టాలు కప్పుతున్న అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

- వర్షానికి తడుస్తున్న ధాన్యం
- అటుగా వెళ్తూ.. టార్పాలిన్ కప్పడంలో రైతుకు సాయం చేసిన ఎమ్మెల్యే
- వడ్లు కొనుగోలు చేయాలని అధికారులకు ఫోన్‌లో ఆదేశం

పుల్‌కల్(అందోల్): ఓ వైపు వర్ష బీభత్సం.. మరో వైపు రోడ్డుపై ఆరబోసిన ధాన్యం తడుస్తుండటంతో తడవకుండా కాపాడటానికి యత్నిస్తున్న రైతులు.. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఈ దృశ్యాలను చూసి చలించిపోయారు. వాహనాన్ని ఆపి రైతులకు సాయంగా నిలిచాడు. వానలో తడుస్తూనే వడ్లపై కప్పుతున్న రైతులకు చేయందించి పట్టాలను కప్పడానికి సాయం చేశారు. స్వయంగా ఎమ్మెల్యే పట్టాలు కప్పడానికి సాయం చేస్తుండటంతో అప్పటి వరకు ఆ రైతులు వర్షంలో పడ్డ బాధలు మరిచి పోయారు. మంగళవారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పుల్‌కల్ గ్రామంలో బీరప్ప దేవాలయాన్ని సందర్శించి వస్తున్నారు. మార్గం మధ్యలో మిన్‌పూర్ గ్రామంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాన్ని చూసి చలించిపోయారు. వాహనం దిగి రైతులకు పట్టాలు కప్పడానికి సాయం చేశారు. మిన్‌పూర్ గ్రామానికి చెందిన మల్లమ్మ ధాన్యం అమ్మడానికి రైతులు పడుతున్న కష్టాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

తొలి రోజు అంతంతే..!

- రూ.2 వేల నోట్లను మార్చుకున్న సామాన్యులు
- నోట్ల మార్పిడికి కేవైసీ వివరాలు కోరిన బ్యాంకులు
- ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకేనన్న అధికారులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి : బ్యాంకుల్లో రూ.2 వేల నోట్ల మార్పిడికి అవకాశం కల్పించిన తొలిరోజు మంగళవారం స్పందన అంతంత మాత్రంగానే ఉంది. దాదాపు అన్ని బ్యాంకుల్లోనూ ఈ నోట్లను మార్పిడీ చేసుకునేందుకు వచ్చే వారి సంఖ్య నామమాత్రంగా ఉందని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. రూ.2 వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బీఐ ప్రకటించిన విషయం విధితమే. వీటిని మార్పిడి చేసుకునేందుకు మే 23 నుంచి సెప్టెంబర్ 30 వరకు గడువు ఇచ్చింది. దీంతో తొలిరోజు ప్రజలు వీటిని మార్చుకోవడం ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకుల బ్రాంచ్‌ల్లో ఈ నోట్లను మార్పిడి చేసుకోవడం, ఆ నోట్లను తమ ఖాతాల్లో డిపాజిట్లుగా చేసుకోవడం ప్రారంభించారు.



గుర్తింపు కార్డు అవసరం లేదు..

- రూ.2 వేల నోట్లు పది (రూ.20 వేల) నోట్లను మార్పిడి చేసుకునేందుకు ఎలాంటి గుర్తింపు కార్డు సమర్పించాల్సిన అవసరం లేదని ఆర్బీఐ తేల్చి చెప్పింది. అలాగే ఎలాంటి పత్రాలు నింపాల్సిన పనిలేదని పేర్కొంది. కానీ క్షేత్ర స్థాయిలో బ్యాంకర్లు ఇందుకు భిన్నంగా వ్యవహరించారు.
- నోట్లు మార్పిడి చేసుకునేందుకు వచ్చిన వారి వద్ద కేవైసీ తీసుకున్నారు. పాన్‌కార్డు, ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు కార్డులను తీసుకున్నారు. రూ.2 వేల నోట్లను తమ ఖాతాల్లో జమ చేసుకునే వారికి వారి కేవైసీ అడగలేదు.
- ఆర్బీఐ ఆదేశాలకు విరుద్ధంగా బ్యాంకర్లు వ్యవహరించారని ఖాతాదారులు తెలిపారు. నకిలీ నోట్లు వస్తే ఇబ్బంది అవుతుందనే కారణంగానే తాము కేవైసీ వివరాలు తీసుకున్నామని బ్యాంకు అధికారులు చెబుతున్నారు.
- తమ ఖాతాల్లో డిపాజిట్ చేసుకున్న వారి వివరాలు తీసుకోలేదన్నారు. కేవలం నోట్ల మార్పిడీ కోసం వచ్చిన వారి వద్ద మాత్రమే వివరాలు తీసుకున్నామని చెప్పారు. పాన్‌కార్డులు లేని వారు కొందరు ఇబ్బందులు పడ్డారు.
- కాగా రెగ్యులర్ లావాదేవీల కోసం బ్యాంకులకు వచ్చే వారికి తోడు, ఈ నోట్లు మార్పిడీ చేసుకునేందుకు వచ్చిన వారు కూడా తోడవడంతో బ్యాంకుల్లో కౌంటర్ వద్ద కాస్త రద్దీ కనిపించింది. దీంతో కొద్ది సేపు క్యూలైన్‌లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డిపాజిట్లే ఎక్కువ..

- రూ.2 వేల నోట్లు సామాన్య ప్రజల వద్ద చాలా తక్కువ. బడాబాబుల వద్దే ఉన్నాయి. దీంతో గతంలో మాదిరిగా బ్యాంకుల్లో క్యూలు కనిపించలేదు.
- జిల్లాలోని ఓ ప్రభుత్వ రంగ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో తొలిరోజు సుమారు 40 మంది వరకు రూ.2 వేల నోట్లను డిపాజిట్లు చేయడం, మార్పిడి చేసుకున్నారని ఆ బ్రాంచ్ అధికారులు పేర్కొన్నారు.
- మిగిలిన బ్యాంకుల బ్రాంచ్‌ల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని బ్యాంకుల్లో సోమవారమే రూ.2 వేల నోట్లను తమ ఖాతాల్లో జమ చేసుకున్నారని బ్యాంకు వర్గాలు తెలిపాయి.

అదనపు కౌంటర్ల అవసరం రాలేదు..

- నోట్ల మార్పిడి కోసం వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని భావించామని, కానీ మార్పిడి కోసం వచ్చే వారు నామమాత్రంగా ఉండటంతో అదనపు కౌంటర్లు తెరవావల్సిన అవసరం రాలేదని ఓ బ్యాంకు అధికారి 'సాక్షి'కి తెలిపారు.
- ప్రస్తుతం ఉన్న కౌంటర్లతోనే మార్పిడి ప్రక్రియను సజావుగా కొనసాగించామని చెప్పారు. ఈ నోట్ల మార్పిడీ కోసం ఎక్కువ మంది వస్తే బ్యాంకు బయట టెంట్లు, నీటి సౌకర్యం కల్పించాలని తమకు ఆదేశాలున్నాయని, కానీ ఆ అవసరం రాలేదని అధికారులు చెప్పారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో మేక మృతి

రామాయంపేట(మెదక్): కాట్రియాల తండా అటవీప్రాంతానికి సమీపంలో గిరిజనులు కొట్టాలు వేసుకొని పశువులు, మేకలను పెంచుకుంటున్నారు. సోమవారం రాత్రి కిషన్‌నాయక్‌కు చెందిన కొట్టాల్లో ఉన్న మేకలపై చిరుత దాడి చేసి ఒక మేకను హతమార్చింది. ఈ విషయమై తండా వాసులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధిత రైతుకు నష్ట పరిహారం ఇవ్వాలని వారు విజ్ఞప్తిచేశారు.

మైనర్లతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

పటాన్‌చెరు టౌన్: సోదరుడి కూతుర్లతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పటాన్‌చెరు పట్టణంలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తి వద్ద, వరుసకు సోదరుడైన వారి పిల్లలు ఉంటున్నారు. అయితే వారి తల్లి వేరే రాష్ట్రంలో యాత్రికులు సందర్శించే పట్టణంలో ఉంటోంది. ఈ క్రమంలో ఆమె కూతుర్లను చూసుకునేందుకు పటాన్‌చెరుకు వచ్చింది. ఎవరి వద్ద ఉంటున్నారో ఆ వ్యక్తే మైనర్లతో అసభ్యంగా ప్రవర్తించాడని తల్లికి చెప్పారు. దీంతో ఆ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, బీజేఆర్ చౌరస్తాల్లో ఐదు రోజుల క్రితం డ్రంకెన్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 24 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.55,000లు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సినీ ఫక్కీలో దోపిడీ

మెదక్ మున్సిపాలిటీ: సినీ ఫక్కీలో స్వర్ణకారుడి బైక్ నుంచి రూ.3లక్షల నగదు, 13 తులాల బంగారం ఎత్తుకెళ్లిన సంఘటన మెదక్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మెదక్ పట్టణంలోని వెంకట్రావ్ నగర్ కాలనిలో నివాసం ఉండే చిన్నోజి సురేశ్ పెద్ద బజార్‌లోని తన బంగారం దుకాణాన్ని సోమవారం రాత్రి 7.30కు మూసి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో కొబ్బరిబోండా తాగేందుకు బైక్ నిలిపాడు. బోండా తాగుతున్న క్రమంలో పల్సర్ బైక్‌పై నుంచి వచ్చిన గుర్తు తెలియని దుండగులు సురేశ్‌బైక్‌పై ఉన్న బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

కొండపాక(గజ్వేల్): సీఈఐఆర్ టెక్నాలజీతో పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను అందజేశారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..మేదినీపూర్ గ్రామానికి చెందిన నరేష్ ఇటీవల సెల్ ఫోన్ పోగొట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వేడుకలకు వెళ్లివస్తూ అనంతలోకాలకు..

- ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొన్న కారు
- తల్లీ కూతురు మృతి
- భర్త, మరో బాలికకు తీవ్రగాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, (ఇన్‌సెట్లో) మృతి చెందిన తల్లీకూతురు స్వరూప, శ్రీలేఖ (ఫైల్)


తల్లీకూతురు స్వరూప, శ్రీలేఖ, మృతదేహాలు

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పటి వరకు బంధువుల పుట్టిన రోజు వేడుకలో సంతోషంగా గడిపారు. తెల్లారితే ఉద్యోగ బాధ్యతలు ఉంటాయని దగ్గరి ప్రయాణం కావడంతో అర్ధరాత్రి సొంత కారులో బయలుదేరారు. ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొనడంతో తల్లీ కూతురు అక్కడికక్కడే మృతి చెందారు. భర్తతో పాటు బంధువుల అమ్మాయికి తీవ్రగాయాలయ్యాయి. వారిని హైదరాబాద్ ప్రయివేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

ఈ సంఘటన కౌడిపల్లి మండలం, అంతారం గేట్ సమీపంలో మెదక్–హైదరాబాద్ 765డి జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి జరిగింది. స్థానిక ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కంచన్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల మల్లేశం కుటుంబ సభ్యులతో కలిసి నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో బంధువుల పుట్టిన రోజువేడుకలకు వెళ్లారు. అనంతరం అర్ధరాత్రి తన కారులో భార్య స్వరూప(36), కూతురు శ్రీలేఖ(13), బంధువుల అమ్మాయి లావణ్య కలిసి ఇంటికి వస్తున్నారు.

శేరితండా పంచాయతీకి చెందిన వ్యక్తి వివాహవిందు చిలిప్‌చెడ్ మండలం సొమ్మతండాలో ఉండగా గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో తండావాసులు వెళ్లారు. మండలంలోని అంతారంగేట్ సమీపంలోనికి రాగానే ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని వెనుక నుంచి దుంపల మల్లేశం కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ట్రాక్టర్ టైర్ విరిగిపోయి ఒకవైపునకు వంగిపోయింది. ఈ ఘటనలో కారులో ఉన్న దుంపల మల్లేశం భార్య స్వరూప, కూతురు శ్రీలేఖ తీవ్రగాయాలతో అక్కడి కక్కడే మృతి చెందారు. మల్లేశంతోపాటు బంధువుల అమ్మాయి లావణ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. బాధితులను 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు.

మృతురాలు కంచన్‌పల్లిలో ఆశావర్కర్

ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న సంఘటనలో మృతి చెందిన దుంపల స్వరూప గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేస్తుంది. మల్లేశం మండలంలోని వెల్మకన్న సబ్‌స్టేషన్‌లో ఆర్టీజన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరి ఒక్కగానొక్క కూతురు శ్రీలేఖ తొమ్మిదో తరగతి పూర్తి చేసుకుంది. ఆశావర్కర్‌గా పని చేస్తున్న స్వరూప గ్రామస్తులందరితో కలుపుగోలుగా ఉండేది. తల్లీ, కూతురు ఒకేసారి మృతి చెందడం భర్తకు తీవ్రగాయాలు కావడంతో కంచన్‌పల్లిలో విషాదం అలుముకుంది.

ప్రయివేటు పనులకు పంచాయతీ ట్రాక్టరా!

గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను ప్రయివేటు పనులకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలు పలు గ్రామాలలో ఇప్పటికే ఉన్నాయి. కాగా శేరితండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను వివాహ విందు కార్యక్రమానికి తీసుకెళ్లారు. ప్రమాదం జరగడంతో ట్రాక్టర్ టైర్ విరిగిపోగా అందులో ప్రయాణిస్తున్న తార్యనాయక్, సరిత, భాస్కర్ తదితరులకు గాయాలయ్యాయి. పంచాయతీ పనులకు మాత్రమే వినియోగించాల్సిన ప్రభుత్వ ట్రాక్టర్‌ను ప్రయివేటు పనులకు వాడుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే


మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను కంచన్‌పల్లిలో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. టీపీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, సీఐటీయూ జిల్లానాయకురాలు నర్సమ్మ, కౌడిపల్లి సీహెచ్‌సీ వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లతోపాటు సర్పంచ్ రజినీసుధాకర్, ఎంపీటీసీ శివయ్య, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సార రామాగౌడ్ తదితరులు అంత్యక్రియలలో పాల్గొన్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు దాటుతున్న కార్మికుడిని ఢీ కొట్టిన వాహనం

చికిత్స పొందుతూ మృతి

మనోహరాబాద్(తూప్రాన్): అర్ధరాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఒరిస్సాలోని సుందర్‌ఘర్ జిల్లా, జోరేకేలా పోస్ట్, బహియాం గ్రామానికి చెందిన సూరజ్ హమ్రామ్ (20) మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పరిశ్రమల వాడలో పనికి వచ్చాడు. సోమవారం అర్ధరాత్రి కాళ్లకల్ శివారులో జాతీయ ర హదారి–44పై రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ వేకువ జామున మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని అన్న మహేందర్ హమ్రామ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కారును ఢీ కొన్న లారీ.. తప్పిన ప్రమాదం


కాళ్లకల్ వద్ద డివైడర్ ఎక్కిన కారు

మనోహరాబాద్(తూప్రాన్): ముందు వెళుతున్న కారును వెనకాలే ఉన్న కంటెనర్ ఢీ కొట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌కు చెందిన భార్యభర్తలు మారుతి కారులో నాచారంగుట్ట దర్శనానికి వెళుతున్నారు. ఈ క్రమంలో వారి కారు మనోహరాబాద్ మండలం కాళ్లకల్ శివారులోకి రాగానే జాతీయ రహదారి–44పై వెనుకనుంచి వస్తున్న కంటెనర్ ఢీ కొట్టింది. దీంతో కారు ఒక్కసారిగా రోడ్డుపై రౌండ్ తిరిగింది. కారు డివైడర్ పైకి ఎక్కి ఆగిపోయింది. కారులో ఉన్న దంపతులు చిరు గాయాలతో బయటపడ్డారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కారును క్రేన్ సహాయంతో పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పరిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు


విగ్నేశ్వర్


సిద్ధు


రాజు

న్యాల్‌కల్(జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన న్యాల్‌కల్ మండల పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని టేకూర్ గ్రామానికి చెందిన విగ్నేశ్వర్, రామ్‌తీర్థ గ్రామానికి చెందిన సిద్ధు, మనూర్‌కు చెందిన రాజు, జహీరాబాద్ సమీపంలోని మహేంద్ర కంపెనిలో అప్రెంటీస్ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నక్రమంలో ఖలీల్‌పూర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొంది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జహీరాబాద్ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

ధాన్యం బస్తాలలోడ్‌తో ట్రాక్టర్ బోల్తా

కొండపాక(గజ్వేల్): ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ప్రమాదవ శాత్తు రాజీవ్ రహదారిపై బోల్తా పడింది. ఈ సంఘటన కొండపాక మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామ శివారులో రాజీవ్ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..సిర్సనగండ్ల గ్రామంలో ప్రభుత్వం కొనుగోలు చేసిన వరి ధాన్యం బస్తాలను ముద్దాపూర్ శివారులోని ఓ రైస్ మిల్లులో దిగుమతి చేసుకుంటుంది. లారీల కొరత మూలంగా ట్రాక్టర్లలో ధాన్యం బస్తాలను తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ధాన్యం బస్తాల లోడ్‌తో వెలుతున్న ట్రాక్టర్ ప్రమాదవ శాత్తు బోల్తా పడటంతో రాజీవ్ రహదారిపై వాహనదారులకు ఆటంకం ఏర్పడింది. డ్రైవరు చాకచక్యంగా ట్రాక్టరుపై నుంచి కిందికి దూకాడు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

చికిత్స పొందుతున్న మున్సిపల్ కార్మికురాలు మృతి

తూప్రాన్: గుర్తు తెలియని వాహనం ఢీ కొని మున్సిపల్ కార్మికురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ సురేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన చెట్లపల్లి పోచమ్మ(59)మున్సిపల్ కార్మికురాలిగా పనులు చేస్తుంది. బంధువుల శుభకార్యానికి సోమవారం ఘనపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్ నుంచి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన పోచమ్మను చికిత్స నిమిత్తం ఆర్వీఎం ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వడదెబ్బతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి


మొగిలిపాక రాజయ్య (ఫైల్)


హుస్నాబాద్: వడదెబ్బతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన హుస్నాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ..మొగిలిపాక రాజయ్య(49) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనోపాధి సాగిస్తున్నాడు. రెండు రోజుల క్రితం ట్రాక్టర్ నడుపుతున్న క్రమంలో రాజయ్య ఎండదెబ్బకు తట్టుకోలేక విరోచనాలతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మంగళవారం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువతి, చేగుంటలో ఇంట్లోనుంచి బయటికి వెళ్లిన గిరిజన యువకుడు అదృశ్యమయ్యారు.

పటాన్‌చెరు టౌన్: యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని గౌతమ్ నగర్ కాలనీకి చెందిన యాదమ్మ కూతురు మనిషా(23) ఆరోతరగతి వరకు చదువుకొని ఇంటివద్దే ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో తల్లి యాదమ్మ తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా కూతురి ఆచూకీ లభించలేదు. తల్లి యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన యువకుడి..


శ్రీనివాస్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): గిరిజన యువకుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి సులిగుట్ట తండాకు చెందిన విఠల్ ఉమాబాయి దంపతుల చిన్న కుమారుడు కంరంటోత్ శ్రీనివాస్ ఈ నెల 10వ తేదీ రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. మళ్లీ తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, స్నేహితుల వద్ద గ్రామాల్లో వెతికినా శ్రీనివాస్ ఆచూకీ లభించలేదు. మంగళవారం తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ తీగలు తెగిపడి పాడి గేదె మృతి

కొల్చారం(నర్సాపూర్): మేతమేస్తున్న పశువుల మందపై విద్యుత్ తీగలు తెగిపడడంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అంశానిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్ల అశోక్ సమీపంలోని వ్యవసాయ పొలంలో పాడి గేదెలను మేపుతున్నాడు. గ్రామంలోని పొలంలో వేళాడుతూ ఉన్న విద్యుత్‌తీగలు ఒక్కసారిగా పశువుల మందపై పడింది. దీంతో మందలోని ఓ పాడి గేదె విద్యుత్ షాక్‌కు మృతి చెందిందన్నారు. పొలంలో వేళాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని ట్రాన్స్‌కో సిబ్బందికి ఎన్ని మార్లు విన్నవించినా సరిచేయలేదు. దీంతో ఈ ప్రమాదానికి విద్యుత్ సిబ్బంది కారకులని అశోక్ ఆరోపించాడు. చనిపోయిన పాడిగేదె విలువ రూ.50 వేలు ఉంటుందని తెలిపాడు. ఈ విషయంలో ట్రాన్స్‌కో అధికారులు తనకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశాడు.

విద్యుదాఘాతంతో రైతు..


మారయ్య మృతదేహం

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ సంఘటన కౌడిపల్లి మండలం తునికిగేట్ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..తునికిగేట్ సమీపంలో ఎంజేపీ పాఠశాల పక్కన హైదరాబాద్ చింతల్‌వద్ద నివాసం ఉండే జంపని మారయ్య(70)కి సుమారు 13ఎకరాల పొలం ఉంది. ప్రతి రోజూ మారయ్య తన పొలంవద్దకు వచ్చి పనులు చూసుకుని సాయంత్రం ఇంటికి వెలుతాడు. ఈ క్రమంలో తన పొలంపక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంట్‌షాక్‌కు గురై చనిపోయాడు. మృతుడు కరెంట్ సరఫరా కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మత్తులు చేసే ప్రయత్నంలో మృతి చెంది ఉండోచ్చని పోలీసులు పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక కూలీ..

దుబ్బాకరూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక కూలీ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం..ఆశయ్య(50) ఇల్లు కట్టుకుని, పెద్దకూతురు వివాహం చేశాడు. దీంతో పాటు బ్యాంక్ లోన్ ద్వారా ట్రాక్టర్ తీసుకున్నాడు. అప్పులు ఎక్కువగా కావడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో సోమవారం రాత్రి 11గంటల సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

కిరాణం షాపులో చోరీ

రూ.3లక్షల నగదు అపహరణ


షాపు షటర్‌ను తెరిచేందుకు యత్నిస్తున్న ఓ వ్యక్తి, లాకర్‌లో ఉన్న నగదును సంచిలో వేసుకుంటున్న దృశ్యం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం, గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని ఓ కిరాణం షాపులో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. షాపు యజమాని, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గడ్డపోతారంలోని శ్రీసాయి ట్రేడర్స్ కిరాణం షాపులోకి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. తెల్లవారు జామున బైక్‌పై నుంచి వచ్చి ఇద్దరు వ్యక్తులు హెల్మెట్ ధరించి షాపు వద్దకు చేరుకున్నారు. అక్కడ వారు వెంట తెచ్చుకున్న నకిలీ తాళాలతో షట్టర్‌ను తెరిచారు. షాపులోకి ఒక వ్యక్తి వెళ్లగా, మరో వ్యక్తి బయట కాపలా ఉన్నాడు. షాపులోని లాకర్‌లో ఉన్న సుమారు రూ.3లక్షలు సంచిలో వేసుకొని షట్టర్ వేసి బయటకు వెళ్లిపోయారు. ఉదయం చోరీ జరిగిన విషయాన్ని షాపు యజమాని దత్తు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీకెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..


శ్యాంసుందర్ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామ శివారులో జరిగింది. ఎస్‌ఐ విజయ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం ఉప్పలం గ్రామానికి చెందిన శ్యాంసుందర్(45) అన్నారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తు జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈ నెల 22న శ్యాంసుందర్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కాగా మంగళవారం దోమడుగు గ్రామ శివారులోని ఓ కుంటలో పడి చెంది ఉన్న విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. విచారణ జరిపిన పోలీసులు మృతదేహాన్ని శ్యాంసుందర్‌గా గుర్తించారు. ఆ కుంట వద్దకు శ్యాం సుందర్ ఎందుకు వెళ్లాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

చేపల వేటకు వెళ్లి ఇద్దరి మృతి

చేపలకోసం చెరువులో దిగి వృద్ధుడు, పాపన్నపేటలో యువకుడు మృతి చెందారు.


ఎల్లయ్య (ఫైల్)

పాపన్నపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పాపన్నపేట మండల పరిధిలోని కందిపల్లిలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కందిపల్లీ గ్రామానికి చెందిన పుట్టి ఎల్లయ్య (25) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం కండిపల్లీ చెరువులో మిత్రులతో కలిసి చేపల వేటకు వెళ్లాడు. అక్కడ చేపలు పట్టేక్రమంలో ఒక ఒడ్డునుంచి ఇంకో ఒడ్డుకు ఈదుతూ వస్తున్న క్రమంలో చెరువు మధ్యలోకి రాగానే శ్వాస అందక పోవడంతో నీట మునిగాడు. దీన్ని గమనించిన తోటి మిత్రులు కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే నీట మునిగి మృతి చెందాడు. ఈ విషయాన్ని వెంటనే కుటుంబీకులకు సమాచారం అందజేశారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ నారాయణ్ కుమార్ తెలిపారు.

చెరువులో దిగి వృద్ధుడు..


మీస యాదయ్య మృతదేహం

కొండపాక(గజ్వేల్): చేపల కోసం చెరువులో దిగి వృద్ధుడు మృతి చెందిన ఘటన కుకునూరుపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామానికి చెందిన మీస యాదయ్య(62) కుటుంబీకులు చేపలు కావాలని అడగడంతో మనవడు, మనవరాలతో వెళ్లి గ్రామంలోని చెరువులో చేపల కోసం గాలం వేశాడు. గాలానికి పడిన చేప గాలాన్ని లాక్కేలుతోంది. ఈ క్రమంలో దాన్ని బయటకు తీసేందుకు చెరువులోకి దిగిన యాదయ్య ప్రమాదవశాత్తు చెరువులోని ముళ్ల పొదలో చిక్కుకొని మునిగి పోయాడు. ఈ విషయాన్ని గమనిస్తున్న చెరువు గట్టుపై ఉన్న మనవడు, మనవరాలు భయాందోళనతో గ్రామంలోకి వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పారు. వెంటనే గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూడగా చెరువులో మునిగి మృతి చెంది కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతుని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైళ్లలో పోలీసుల తనిఖీలు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

జహీరాబాద్: జహీరాబాద్‌లో పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు రైళ్లలో తనిఖీలు నిర్వహించారు. మంగళవారం జహీరాబాద్, కోహీర్ రైల్వే స్టేషన్లలో ఆగిన రైళ్లలో తనిఖీలు చేపట్టారు. కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రాకుండా తనిఖీలు చేశారు. ప్రతి కోచ్‌లో ప్రయాణికుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. నాందేడ్ నుంచి బెంగుళూరు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ రైలులో బీదర్‌కు చెందిన వ్యక్తి వద్ద 4 క్వార్టర్ల దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ వి.రఘు, సీఐలు భూపతి, వెంకటేశ్, ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐలు శ్రీకాంత్ పాల్గొన్నారు.

దళితుల భూములను అన్యాక్రాంతం చేస్తే సహించం

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): దళితుల భూములను అన్యాక్రాంతం చేస్తే సహించేది లేదని, బడా నయా భూస్వాముల ఆగడాలను అరికట్టకపోతే ప్రజా ఉద్యమాలు తప్పవని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ హెచ్చరించారు. మండల పరిధిలోని చెప్యాలలో అన్యాక్రాంతమవుతున్న భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. భూముల వివరాలను దళితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని సర్వే నంబర్ 205/3లో పలు దళిత కుటుంబాలకు ప్రభుత్వం ఆరు ఎకరాల అసైన్డ్ భూములను పంపిణీ చేసిందని గుర్తు చేశారు. వరి సాగు చేస్తున్న భూమిలో కోతలు కోయనీయకుండా అదే గ్రామానికి చెందిన కూర అంతయ్య, కిషోర్‌లు అట్టి భూములను తామే కొన్నామని దళితులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. దళితుల భూముల జోలికి వస్తే ఊరికునేది లేదన్నారు.

వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ఐకేపీ వీఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డీబీఎఫ్ (దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మంగళవారం నిరవధిక సమ్మె చేస్తున్న వీఓఏలకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలన్నారు.

ద్విచక్రవాహనాల దొంగల పట్టివేత

దుబ్బాకరూరల్: ద్విచక్రవాహనాలను ఎత్తుకెళ్తుండగా గ్రామస్తులు పట్టుకుని పోలీస్‌లకు అప్పగించిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బొప్పాపూర్‌లో జరిగింది. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ఉసుక స్వామి(వీఆర్‌ఏ) ఈ నెల 20న రాత్రి తన ఇంటి ముందు టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని నిలిపి ఉంచాడు. ఉదయం లేచి చూసే సరికి వాహనం కనబడలేదు. ఈ విషయాన్ని చుట్టు ప్రక్కల గ్రామాల్లోని వాహన మెకానిక్‌లకు తన వాహనం ఎత్తుకెల్లిన విషయాన్ని నంబర్ ప్లేట్‌తో సహా వారికి తెలియ జేశాడు. ఈ క్రమంలో మంగళవారం నిజాంపేట మండలం కల్వకుంట గ్రామం వద్ద మెకానిక్ లక్ష్మణ్ దగ్గరికి ఇద్దరు వ్యక్తులు వచ్చి బొప్పాపూర్‌లో దొంగిలించడిన వాహనాన్ని అమ్మి పెట్టమని కోరారు. వెంటనే మెకానిక్ వాహన యజమాని స్వామికి సమాచారం చేరవేశాడు. గ్రామస్తులతో అక్కడికి చేరుకుని వారి ఇద్దరిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం వారిని విచారించగా బొప్పాపూర్‌కు చెందిన మైసయ్య, ఎనగుర్తి గ్రామానికి చెందిన రాజేశ్‌గా గుర్తించి నిందితులను భూంపల్లి పోలీస్‌లకు అప్పగించారు. వారినుంచి రెండు ద్విచక్రవాహనాలను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రామచంద్రాపురం: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..ఓ వ్యక్తి అశోక్‌నగర్‌లో రోడ్డుపై పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి అతణ్ని 108 అంబులెన్స్‌లో పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడని డాక్టర్లు తెలిపారు. సంబంధికులు ఎవరైనా ఉంటే స్థానిక పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని వారు తెలిపారు.

క్లుప్తంగా

ఘన వ్యర్థాల పారబోత



పారబోసిన వ్యర్థ ఘన పదార్థాలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని పారిశ్రామికవాడలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం తెల్లవారుజామున ఘన వ్యర్థాలను పారవేశారు. దీంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లాయి. పారిశ్రామిక వాడల్లో తరచూ గుర్తుతెలియని వ్యక్తులు వ్యర్థ జలాలను పారబోయటం, ఘన వ్యర్థాలను సంచుల్లో వేసి పారవేయటం జరుగుతున్నా పీసీబీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పారిశ్రామిక వాడల ప్రజలు ఆరోపిస్తున్నారు. వ్యర్థ ఘన పదార్థాలను పారేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అకాలవర్షంతో రైతుల ఇబ్బందులు



తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెట్టిన దృశ్యం

జిన్నారం (పటాన్‌చెరు): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం అర్ధరాత్రి వర్షం పడటంతో ఎండబెట్టిన వడ్లు పూర్తిగా తడిశాయి. దీంతో రైతులు మంగళవారం తెల్లవారుజామున ధాన్యంను ఎండబెట్టారు. అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.


గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఎమ్మెల్యేతో సర్పంచ్, నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని జంగంపేట సర్పంచ్ వెంకటయ్య, ఎంపీటీసీ వెంకటేశం గౌడ్, ఉపసర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, వార్డుసభ్యులు మంగళవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. మరిన్ని నిధులు కేటాయిస్తే గ్రామంలోని సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమవుతాయని తెలిపారు. నిధుల కేటాయింపులో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డివిజన్‌ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్లు బృందం

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ పరిధిలోని భారతినగర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం డివిజన్‌ల పరిధిలో చేపట్టబోయే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం హైదరాబాద్‌లోని బల్దియ ప్రధాన కార్యాలయంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డిలతో కలిసి కమిషనర్ లోకేష్‌కుమార్‌తో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మూడు డివిజన్ల పరిధిలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టాల్సి వస్తుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రహరీని తొలగించండి

పటాన్‌చెరు: కాలనీ రోడ్డును ఆక్రమిస్తూ చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని అమీన్‌పూర్ పట్టణంలోని ప్రణీత్‌కౌంటీ కాలనీవాసులు పటేల్‌గూడ గ్రామ పంచాయతీ కార్యదర్శికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ తమ కాలనీ హెచ్‌ఎండీఏ అనుమతులతో నిర్మించారని, అందులోని రోడ్లను ఎవరూ కబ్జా చేసే అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కాలనీలోని రోడ్డు ఆక్రమిస్తూ ఓ వ్యక్తి నిర్మిస్తున్న ప్రహరీని వెంటనే అడ్డుకోవాలని అధికారులను కోరారు.

చైర్‌పర్సన్ తీరుపై కౌన్సిలర్ల మండిపాటు



మీడియాను బయటకు పంపిస్తున్న పోలీసులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

- గద్దె దిగాలంటూ ప్లకార్డులతో నిరసన
- వాడీవేడిగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి మున్సిపల్ బల్దియాలో అవినీతి పేరుకుపోయిందని, మున్సిపచైర్‌పర్సన్ గద్దె దిగాలంటూ అధికార పార్టీ కౌన్సిలర్లు నిరసన తెలిపారు. మంగళవారం చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. సమావేశంలో ప్రారంభంలోనే శివాజీ విగ్రహం ఏర్పాటుకు ఆమోదం తెలపాలని కొందరు, ముస్లిం కౌన్సిలర్ల మినార్ విగ్రహం పెట్టాలంటూ మరికొందరు పట్టుబట్టారు. అనంతరం 7వ వార్డు కౌన్సిలర్ బోయిని విజయలక్ష్మి పని చేయకుండా కార్మికుల వేతనాలు తీసుకుంటున్నారని, డబ్బు రికవరీ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్ సాబేర్ మాట్లాడేందుకు ప్రయత్నించగా అసమ్మతి కౌన్సిలర్లు వాగ్వాదానికి దిగారు. దీంతో కౌన్సిలర్ల మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఎజెండా అంశాలను చదువుతుండగా కౌన్సిలర్లు ప్లకార్డులతో నిరసన తెలిపి, అవినీతిపై విచారణ చేపట్టాలని పట్టుబట్టారు. చైర్‌పర్సన్ తమ్ముడు పట్టణంలో అక్రమంగా పార్కు స్థలం కబ్జా చేశాడంటూ సంబంధిత డాక్యుమెంట్‌ను 7వ వార్డు కౌన్సిలర్ వియజలక్ష్మి మీడియా ముందు ఉంచారు. తనను మహిళ అని చూడకుండా తనను అవమానించారని చైర్‌పర్సన్ కంటతడి పెట్టారు.

సభ దృష్టికి సమస్యలు

ప్రతి నెలా మున్సిపల్ సమావేశం నిర్వహించాలని కౌన్సిలర్ నాగరాజ్ డిమాండ్ చేయగా పట్టణంలో డంప్ యార్డ్, వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్ నాయికోటి రామప్ప, కౌన్సిలర్ విష్ణువర్ధన్ కమిషనర్‌ను కోరారు. ప్రభుత్వం స్థలంలో త్వరలో డంప్‌యార్డ్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లత, కమిషనర్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



రాస్తారోకో చేస్తున్న రైతులు

స్తంభించిన రాకపోకలు

హత్నూర (సంగారెడ్డి): కొనుగోలు కేంద్రాలలోని ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఆగ్రహించిన రైతన్నలు మంగళవారం పటాన్‌చెరు–దౌల్తాబాద్ రోడ్డుపై రైతులు రాస్తారోకో చేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం తీసుకువచ్చి 10, 15 రోజులైనా నిర్వాహకులు కొనుగోలు చేయడంలేదని వాపోయారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పట్టించుకోవడంలేదన్నారు. 15 రోజులుగా కొనుగోలు కేంద్రం వద్ద నిరీక్షించాల్సిన వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతుల ధర్నాతో రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ లక్ష్మారెడ్డి పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రైతుల ఆందోళన విరమింపజేశారు. రైతులకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ధర్నాలో పాల్గొన్నారు.

మహార్యాలీ సన్నాహ సభలు



మాట్లాడుతున్న లింగయత్ నాయకుడు

సంగారెడ్డి టౌన్: ఓబీసీ సాధనకై జూన్ 4వ తేదీన నిర్వహించే లింగాయత్ బహిరంగ సభ జయప్రదం చేయాలని వీరశైవ లింగాయత్ నాయకులు పిలుపు ఇచ్చారు. మంగళవారం వారు మాట్లాడుతూ వీరశైవ లింగాయత్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పట్లోళ్ల సంగమేశ్వర్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా లింగాయత్ బహిరంగ సభ సన్నాహ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఓబీసీలో లింగాయత్‌లను కలపాలని, రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ నాయకులు ఈశ్వరప్ప, శెట్టి శివ, శంకర్ పాటిల్, పృథ్వీరాజ్, మల్లికార్జున్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు చేర్చాలి

కంది(సంగారెడ్డి): రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు చేరేలా చూడాలని తహసీల్దార్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం కందిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు 5,6 లారీలను కొనుగోలు కేంద్రానికి పంపుతున్నామన్నారు. ధాన్యం తీసుకువచ్చేందుకు అవసరమైన గోనేసంచులను రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీరు, నీడ వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. సీఈఓ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు137 మంది రైతులనుంచి 12297 సంచుల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపినట్లు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో ఐకేపీ వీఓఏల నిరసన



జోగిపేట: నిరసన తెలుపుతున్న వీఓఏలు

జోగిపేట(అందోల్): ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం వీఓఏలు నల్ల బ్యాడ్జ్‌లతో నిరసన తెలుపుతూ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ 37 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వీఓఏల జిల్లా నాయకులు మల్లన్న, లక్ష్మారెడ్డి, వీఓఏలు విజయ, రేణుక, సుప్రియ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

ఝరాసంగం(జహీరాబాద్): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఝరాసంగం ఐకేపీ కార్యాలయం ఆవరణలో వీఓఏలు చేపట్టిన సమ్మె మంగళవారంతో 37వ రోజుకు చేరింది. కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఓఏలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే మాణిక్‌రావు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ప్రజా సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. మంగళవారం జహీరాబాద్‌లో నిర్వహించిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వారిని ఆదుకునేందుకు కళ్యాణలక్ష్మి–షాదీ ముబారక్ పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ఆత్మచైర్మన్ పెంటారెడ్డి, కేతకీ చైర్మన్ నీల వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, బీఆర్‌ఎస్ నాయకులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ బస్తాల పంపిణీని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం రాయితీపై ఆయా విత్తనాలను పంపిణీ చేస్తోందన్నారు. ఖేడ్ డివిజన్ పరిధిలో పంపిణీకి 40 క్వింటాళ్ల జనుము, 533 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏడీఏ శంకర్, రైబస మండల అధ్యక్షులు సత్యపాల్‌రెడ్డి, గంగాపూర్ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్‌చౌహాన్, వడ్ల ప్రభాకర్, డివిజన్ పరిధిలోని ఏఈవోలు, ఆత్మసిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల హర్షం



రాయికోడ్: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జేపీఎస్‌లు



వట్‌పల్లి : ఎంపీడీఓ, ఎంపీఓకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వట్‌పల్లి(అందోల్): జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో కార్యదర్శిలు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జేపీఎస్ సంఘం నాయకులు ఎంపీడీఓ జగదీశ్వర్, ఎంపీఓ యూసుఫ్‌లకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

జహీరాబాద్: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సర్వీసు క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్‌కు దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రజినికాంత్, రాములు, సంగమేశ్వర్, కృష్ణ, యాదుల్, గౌసొద్దీన్, సరిత, సుప్రియ, అమూల్య పాల్గొన్నారు.

వెలగని సెంట్రల్ లైటింగ్



ప్రధాన రహదారి ఐటీఐ వద్ద వెలగలని సెంట్రల్ లైటింగ్

సంగారెడ్డిఅర్బన్ : సంగారెడ్డి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఐటీఐ కూడలి సెంటర్ లైటింగ్ వెలగడం లేదు. ఐటీఐ కాలేజీ నుంచి పెట్రోల్ బంక్ వరకు కొన్ని రోజులుగా లైట్లు వెలగకపోవడంతో ఆ ప్రాంతం అంధకారంగా మారింది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం పర్యటించే ఈ రోడ్డులో లైట్ల పరిస్థితి ఇలా మారడంపై పట్టణవాసులు పెదవి విరుస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే సెంటర్‌లైటింగ్ మరమ్మతులు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మల్లికార్జునస్వామి ఆలయంలో నీలం మధు పూజలు



జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అండూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన మల్లికార్జునస్వామి ఉత్సవాలకు చిట్కుల్ సర్పంచ్ నీలం మధు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీనిచ్చారు. దేవుడి కృపతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ 25న దివ్యాంగుల బస్‌పాస్ మేళా

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని బస్టాండ్‌లో మే 25న దివ్యాంగుల బస్‌పాస్ మేళాను నిర్వహించనున్నట్లు ఏటీఎం బస్‌పాస్ నిర్వాహకుడు మహేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల మేళా 25వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బస్‌పాస్ కోసం వచ్చే దివ్యాంగులు సదరన్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫోటోలు తీసుకొని రావాలన్నారు. దివ్యాంగుల బస్‌పాస్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

నారాయణఖేడ్: మండలంలోని తుర్కాపల్లిలో నిరుపేద కుటుంబానికి చెందిన చాకలి వెంకన్న సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో కుటుంబీకులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని విగ్రాం రామాగౌడ్ పీపుల్స్ వెల్ఫేయిర్ ట్రస్టు చైర్మన్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

◆ భవాని మందిరంలో పూజలు

సంగారెడ్డి టౌన్: పట్టణంలో పాత బస్టాండ్ సమీపంలోని భవానీ భువనేశ్వరి దేవాలయంలో మంగళవారం అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

◆ ఎరువులు, పురుగు మందుల దుకాణం తనిఖీ



న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గంగ్వార్ చౌరస్తాలో రైతుమిత్ర ఎరువులు, పురుగు మందుల విక్రయ దుకాణాన్ని మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య తనిఖీ చేసి మందులు, విత్తనాలు, రిజిస్టర్లను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని నిర్వాహకులకు సూచించారు.

◆ వీఓఏల సమ్మెపై నిర్బంధాన్ని ఆపాలి

కొండాపూర్(సంగారెడ్డి): వీఓఏల సమ్మెపై నిర్బంధాన్ని ఆపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి ఐకేపీ వీఓఏలను సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

◆ కొనసాగుతున్న బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

పుల్‌కల్(అందోల్): పుల్‌కల్‌లో బీరప్ప విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం భక్తులు బోనాలు సమర్పించారు. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, బీజేపీ నాయకులు మాజీ మంత్రి బాబూమోహన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

◆ ఘనంగా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని నాగ్సాన్‌పల్లిలోని ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం సర్పంచ్ ఎల్లం ఆధ్వర్యంలో గ్రామస్తులు బోనాలను ఊరేగించి, అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బోనం ఎత్తుకున్నారు.

◆ మంగపూర్‌లో విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు



జహీరాబాద్: మహీంద్ర కాలనీ సమీపంలోని మంగపురం కాలనీలో ఘనంగా శివ పంచాయత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

◆ సిద్ధేశ్వర ఆలయంలో పూజలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని సిద్ధేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించినట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

◆ సీఈఓపై చర్యలు తీసుకోవాలి

కొండాపూర్(సంగారెడ్డి): అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న మల్కాపూర్ పీఏసీఎస్ సీఈఓపై చర్యలు తీసుకోవాలని సొసైటీ డైరక్టర్ అనిల్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుల వద్ద తేమ శాతం పేరుతో తరుగు తీస్తే అధికార పార్టీ నాయకులకు సంబంధించిన వారి దగ్గర ఎలాంటి తేమ శాతం చూడకుండా కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి సొసైటీ సీఈఓపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

మునిపల్లి(అందోల్): బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడిగా పెద్దలోడి గ్రామానికి చెందిన వడ్ల విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఎంపిక చేశారని విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

◆ శివాలయంలో ఆరుద్ర పూజలు



సంగారెడ్డి టౌన్ : సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని కేతకి సంగమేశ్వర ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజ్‌శర్మ, శివకుమార్ పంతులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

◆ డిప్యూటీ తహసీల్దార్‌కు సన్మానం



న్యాల్‌కల్(జహీరాబాద్): ఇటీవల బదిలీపై న్యాల్‌కల్‌కు వచ్చిన డిప్యూటీ తహసీల్దార్ మునిరొద్దీన్‌ను మంగళవారం బీఆర్‌ఎస్ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు. వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ సీపీఐ మహాగర్జన పోస్టర్ ఆవిష్కరణ

జహీరాబాద్ టౌన్: కొత్తగూడెంలో ఈ జూన్ 4న నిర్వహించతలపెట్టిన 'మహాగర్జన' పోస్టర్‌ను సీపీఐ నాయకులు మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజు, శంకర్, సుధాకర్, మొగులయ్య, జహంగీర్, విశ్వనాథ్, తాజోద్దీన్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

◆ 27న పంప్‌హౌస్ ప్రారంభం

మునిపల్లి(అందోల్): ఈ నెల 27వ తేదీన మండలంలోని చిన్నచల్మెడలో పంప్‌హౌస్‌ను ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తారని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

◆ ఘనంగా శివ పంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పస్తాపూర్ మంగాపూర్ కాలనీలో శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఈ నెల 24 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం అవాహిత దేవత మండపారాధన, విగ్రహాలకు విశేష అభిషేకం, తదితర పూజలను నిర్వహించారు.

◆ కంటి వెలుగు ప్రారంభం



సంగారెడ్డి మున్సిపాలిటీ: చౌటకుర్ మండలం చక్రియాల్ గ్రామంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): మున్సిపల్ కేంద్రంలో కొనసాగుతున్న ఉచిత కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం జోగిపేట మాజీ మార్కెట్ చైర్మన్ నాగభూషణం సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ రబియా సుల్తానా, వైద్యసిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.